# 'కంటి వెలుగు' క్యాంపులు కిటకిట

- ఉచితంగా కంటి వైద్య పరీక్షలు
- అప్పటికప్పుడే కళ్లద్దాలు అందజేత
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**చుంచుపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. గ్రామాల్లో అధికారులు మైకుల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మొదటి రోజు భారీ ఎత్తున క్యాంపులకు తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. రెండో రోజు శుక్రవారం సైతం అదే తరహాలో కంటి వైద్య పరీక్షలకు తరలివచ్చారు. ప్రభుత్వం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కంటి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసింది. వివిధ పీహెచ్‌సీల పరిధిలో ఈ కంటి వెలుగు క్యాంపులను నిర్వహిస్తున్నారు. చుంచుపల్లి మండలం పెనగడప పీహెచ్‌సీ పరిధిలో 18 గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. మండలంలో 30,143 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామాల్లో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో క్యాంపులో 8 – 10 మంది వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కంటి వైద్య పరీక్షలకు వచ్చే ప్రజల కోసం ప్రత్యేకంగా టెంట్లు, కుర్చీలు, మంచినీటి సౌకర్యం సమకూర్చారు. ఒక్కో క్యాంపులో మొత్తం ఐదు టేబుళ్ల ద్వారా కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది నిర్వహిస్తోంది. ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించడంతో ప్రతిఒక్కరూ ఆధార్ కార్డుతో శిబిరాలకు హాజరవుతున్నారు. తొలి రెండు రోజులు కంటి వెలుగు క్యాంపులు జనంతో సందడిగా మారాయి. కంటి పరీక్షలకు వచ్చిన వారిని వైద్య సిబ్బంది పరీక్షించి దృష్టి లోపాలను గుర్తిస్తున్నారు. పలు రకాల కళ్లజోళ్లను అందుబాటులో ఉంచారు. 2 ప్లస్ దృష్టి లోపం ఉన్నవారికి వెంటనే రీడింగ్ గ్లాసులు అందజేస్తున్నారు. త్రీ ప్లస్ కంటే ఎక్కువ దృష్టి లోపం ఉన్నవారికి ఆన్‌లైన్‌లో కళ్లద్దాలు ఆర్డర్ చేస్తున్నారు. అవి 15 రోజుల్లో లబ్ధిదారులకు అందనున్నాయి. గ్రామాల్లో కంటి వెలుగు క్యాంపులను ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రెండో విడత కంటి వెలుగుకు గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోంది.



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

### దృష్టి లోపం ఉందని చెప్పారు



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు క్యాంపులో కంటి పరీక్షలు చేయించుకున్నాను. వైద్య సిబ్బంది పరీక్షలు చేసి ఎక్కువ దృష్టి లోపం ఉందని చెప్పారు. దాని కోసం ప్రత్యేకంగా కళ్లజోళ్లను ఆర్డర్ చేశారు. పదిహేను రోజుల్లో వస్తాయని చెప్పారు. గ్రామాల్లో శిబిరాల ఏర్పాటు బాగుంది.

– కట్టా అచ్చమ్మ, పెనగడప

### పరీక్షలు చేసి కళ్లద్దాలు ఇచ్చారు



కంటి వెలుగు శిబిరంలో వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. నాకు 2.50 దృష్టి లోపం ఉంది. వెంటనే రీడింగ్ గ్లాసులు ఇచ్చారు. శిబిరానికి రాగానే జాప్యం చేయకుండా వైద్య సిబ్బంది వెంటనే కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందించడం సంతోషంగా ఉంది.

– జి.రాజేశ్వరి, రాంనగర్

### మంచి స్పందన వస్తోంది



పెనగడప పీహెచ్‌సీ పరిధిలో కంటి వెలుగు క్యాంపుకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. మొదటి రోజు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు ఇచ్చాం. గ్రామపంచాయతీ సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించడంతో స్వచ్ఛందంగా శిబిరాలకు వస్తున్నారు.

– నేహా అంబ్రీన్, వైద్యాధికారి, పెనగడప

## ఏరియాలో ఎకో పార్క్‌ల నిర్మాణం పరిశీలన



పార్క్‌ను పరిశీలిస్తున్న అధికారులు

**సింగరేణి(కొత్తగూడెం):** కొత్తగూడెం ఏరియా పరిధిలో రూ.4.5 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎకో, ప్రగతి వనం పార్క్‌లను జీకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ రమేష్, ఇతర విభాగాల అధికారులు శుక్రవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ.. బొగ్గు తీసిన గనులలో పార్క్‌లు ఏర్పాటు చేయాలని మినిస్ట్రీ ఆఫ్ కోల్, కేంద్ర పర్యావరణ శాఖ విభాగాల ఆదేశాల మేరకు ఏరియాలో రూ.2.5 కోట్లతో ఎకో పార్క్, రూ.2 కోట్లతో ప్రగతి వనంలో పలు ఎన్విరాల్‌మెంట్ పనులు చేపడుతున్నామని ఇందులో భాగంగా ఎకో పార్క్‌లో సుమారు 2 లక్షల మొక్కలను పెంచేందుకు అనువైన నర్సరీ, ప్రగతి వనం పార్క్‌లో బోటింగ్ సిస్టమ్ డెవలప్ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికి 80శాతం పనులు పూర్తయ్యాయని పనులు పూర్తయిన తరువాత టూరిజం శాఖకు అప్పగిస్తామన్నారు. దీనిలో భాగంగా ధన్‌బాద్ చెరువు చుట్టూ కాంపౌండ్, లైటింగ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా పార్క్‌లో సీతాకోకచిలుకల పెరిగేందుకు మకరందం విరజిల్లే పువ్వులు, తాళ్లవనం, తేనెటీగల చాంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జీకే ఓసీ మేనేజర్ కరుణాకర్, డీజీఎం ఫారెస్ట్రీ హరినారాయణ, డీజీఎం పర్సనల్ సామ్యేల్ సుధాకర్, సీనియర్ పీఓ శ్రావణ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

**పాల్వంచ:** పాల్వంచలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో ఫిబ్రవరి 3, 4, 5 తేదీల్లో స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠ వాల్‌పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయ మేల్ తంత్రి శ్రీ కంఠారరు మహేశ్వరారు మోహనరరు తంత్రి, శబరిమల వంశ పారంపర్య ప్రధాన తంత్రి కంఠారరు మోహనరరు తంత్రిచే నిర్వహించడం జరుగుతుందన్నారు. 5వ తేదీన విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ప్రతిష్ఠ, సాయంత్రం 18 మెట్ల పూజతో పాటు పుష్పాభిషేకం, అత్తాగ పూజ, హరివరాసనం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా 25వేల మందికి అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొత్వాల శ్రీనివాసరావు, బందెల శ్రీనివాసరావు, మిరియాల కమలాకర్, బండి లక్ష్మణ్, కనగాల రాంబాబు, కాల్వ భాస్కర్‌రావు, మేడిద సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 30న 'చలో ఢిల్లీ'

**కొత్తగూడెంఅర్బన్:** తెలంగాణ విభజన చట్టంలోని హామీల సాధన కోసం జరుగనున్న చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్లను తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బస్టాండ్ సెంటర్‌లోని అమర వీరుల స్తూపం వద్ద నాయకులు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనకై తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 30, 31న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 30న జంతర్ మంతర్ వద్ద దీక్ష, 31న కేసీఆర్ తొమిదేళ్ల పాలన, అభివృద్ధి – వాస్తవాలపై సెమినార్ నిర్వహిస్తున్నారని దానిని విజయవంతం చేసేందుకు ప్రజలందరూ తరలిరావాలని కోరారు.

# మిగులు భూములను పంచివ్వండి



మాట్లాడుతున్న రంగారెడ్డి పక్కన గుమ్మడి నర్సయ్య

**సింగరేణి(కొత్తగూడెం):** మిగులు భూములను వ్యవసాయ కార్మికులకు పంచాలని, ఏఐకేఎంఎస్ సభలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ జనరల్ బాడీ సమావేశం కొత్తగూడెంలోని పీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. వారు మాట్లాడుతూ.. దేశంలో ఎలాంటి చట్టపరమైన హక్కులు లేకుండా జీవిస్తున్న వ్యవసాయ కార్మికులను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. వారికి కనీస వేతన చట్టం వర్తింపజేసి మిగులు భూములు వారికి పంచాలని, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, 57 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు రూ.10వేలు పెన్షన్ అందజేయాలన్నారు. వారి కుటుంబాలకు ఉచిత వైద్యం, పిల్లలకు విద్యను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాయిని రాజు, కార్యదర్శిగా అమర్లపూడి రాము, 21 మందిని కార్యవర్గం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనికి ముందు సంఘం జెండాను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ కృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభాకర్, నూపా భాస్కర్, బొర్ర వెంకన్న, మాచర్ల సత్యం, ముద్దా భిక్షం, పూనేకుమార్, రమేష్, కురసం ముత్యాలరావు, వెంకటమ్మ, బుర్ర వెంకన్న, పట్టణ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

# దాడులు అరికట్టడంలో విఫలం



సమావేశంలో నినాదాలు చేస్తున్న పీఓడబ్ల్యూ మహిళా నేతలు

**టేకులపల్లి:** మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు విఫలమయ్యారని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్తి రాములమ్మ, ఎ.నిర్మల విమర్శించారు. ఈనెల 28, 29 తేదీల్లో మహబూబాబాద్‌లో జరిగే పీఓడబ్ల్యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో నోముల కళావతి, తోటకూరి చిట్టెమ్మ, చింత లాలమ్మ, పెనక లక్ష్మి, జార లక్ష్మి, భూక్యా చిన్ని, బోడ మంగ, అలివేలు, లక్ష్మి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే బాలికల్లో వికాసం



మాట్లాడుతున్న లెనీనా

**సుజాతనగర్:** చట్టాలపై బాలికలకు అవగాహన అవసరమని జిల్లా సంక్షేమాధికారిణి జేఎంఎస్ లెనీనా అన్నారు. జాతీయ బాలికా వారోత్సవాల్లో భాగంగా సింగభూపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలికలకు శుక్రవారం చట్టాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. విద్యతోనే బాలికలకు మనోవికాస చైతన్యం చేకూరుతుందన్నారు. ఆడపిల్లల్లో అడుగడుగునా ఎదురవుతున్న ఆంక్షలను తొలగించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జాతీయ బాలికాభివృద్ధి మిషన్ కార్యక్రమాన్ని చేపట్టి ఆడపిల్లల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా సమాజంలో బాలికల సంరక్షణ, బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్య, పోషకాహారం, సామాజిక ఎదుగుదల వంటి విషయాలపై అవగాహన కల్పిస్తోందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

## బేటీ పడావో.. బేటీ బచావో.. అందరి బాధ్యత



టేకులపల్లిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ తార

**టేకులపల్లి:** బేటీ పడావో.. బేటీ బచావో.. నినాదాన్ని అందరూ ఆచరించాలని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈనెల 24న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. ఆడపిల్లలు చదువుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆడపిల్లలను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నా, బాలికలు అక్రమ రవాణాకు గురవుతున్నా, బాలికలపై లైంగిక వేధింపులు, బాలకార్మికులుగా మారినా వారిని వారు ఎలా రక్షించుకోవాలి, ఇతరులు ఎలా కాపాడాలని తెలియజేస్తూ అత్యవసర టోల్‌ఫ్రీ నెంబర్లు 1098, 100లకు ఫోన్ చేసి సమాచారం అందజేయాలని తెలిపారు. బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోషకాహారం గురించి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్మించి ప్రతిజ్ఞ చేశారు. స్వేచ్ఛా బెలూన్లు ఎగురవేశారు. సూపర్‌వైజర్లు అనురాధ, లక్ష్మి, సక్కుబాయి, యశోద, హెచ్‌ఎం భద్రు, టీచర్లు రంగారావు, బాబూరావు, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఫీల్డ్ వర్కర్ లత పాల్గొన్నారు. సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో శంభునిగూడెం, ఒడ్డుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

### పౌష్టికాహారం పంపిణీ

**కొత్తగూడెంరూరల్:** జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీ, 3వ లైన్‌లో శుక్రవారం డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు పిలుపు మేరకు టీబీ వ్యాధితో బాధపడుతున్న 200మంది పేషెంట్లకు న్యూట్రిషన్ ఫుడ్ ప్యాకెట్లను ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు.

### ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న శంకర్

**జూలూరుపాడు:** మండలంలోని కొత్తూరుకు చెందిన ఫొటోగ్రాఫర్ గార్లపాటి శంకర్‌కు జాతీయ స్థాయి పోటీల్లో అవార్డు అందుకున్నారు. ఇటీవల ఏపీలోని అరకులో నిర్వహించిన నేషనల్ వర్క్‌షాప్‌లో గిరిజన సంప్రదాయాలు, జీవన విధానంపై తీసిన ఫొటోలకు గాను ఆయనకు అవార్డు లభించింది. ఈ సందర్భంగా శంకర్‌ను శుక్రవారం స్థానిక ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

### రైతుబంధును అప్పు కింద జమ చేసుకోవద్దు

**పాల్వంచ:** ప్రభుత్వం రైతులు ఇస్తున్న రైతు బంధు సాయాన్ని రుణాల కింద జమ చేసుకుంటే ఊరుకునేది లేదని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక యూనియన్ బ్యాంక్‌లో రైతు బంధును జమ చేసుకోవడంతో రైతులతో కలిసి కొత్వాల శ్రీనివాసరావు స్పందించారు. బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన వారు రైతు బంధు డబ్బులను రైతులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భూక్యా రవీందర్, విజయ్, ఎలికా వెంకట్రావ్, సోయం రాజేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యదర్శిపై ఫిర్యాదు

**జూలూరుపాడు:** చింతలతండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసి బదిలీ అయిన సుమపై సర్పంచ్ భూక్యా రాములు శుక్రవారం కలెక్టర్ అనుదీప్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. సర్పంచ్‌కు తెలియకుండా నిధులు డ్రా చేసి దుర్వినియోగానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

### తోపుడు బండ్ల పంపిణీ

**చుంచుపల్లి:** లయన్స్ క్లబ్ ఆఫ్ మిలీనియం కొత్తగూడెం, లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రెసిడెంట్ కావ్య జన్మదినం సందర్భంగా చిరు వ్యాపారులకు చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణప్రసాద్ చేతుల మీదుగా 12 మందికి తోపుడు బండ్లు పంపిణీ చేశారు. చారి, పితాని సత్యనారాయణ, గబ్బేడ రాజయ్య, రాయల శాంతయ్య, పల్లపు వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, గుత్తుల శ్రీనివాస్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

### పెంచిన వేతనాలు ఇవ్వండి

**కొత్తగూడెంఅర్బన్:** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు పెంచిన వేతనాలు వెంటనే అమలు చేయాలని వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాలలో వర్కర్లు నల్లబ్యాడ్జిలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌తోనే రైతు రాజ్యం సాధ్యం



కార్యకర్తలతో సమావేశమైన రామ్మూర్తి నాయక్

**జూలూరుపాడు:** ఈనెల 26 నుంచి జరిగే హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని గ్రామగ్రామాన నిర్వహించాలని టీపీసీసీ సభ్యుడు, వైరా నియోజకవర్గ నాయకుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పాపకొల్లు, భోజ్యాతండా గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అమలు పరిచిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, రైతు రాజ్యం కాంగ్రెస్‌తోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో నున్నా కృష్ణయ్య, బానోత్ నవీన్ రాథోడ్, గుగులోత్ ప్రియాంక, కొలిపాక శ్రీనివాసరావు, వాంకుడోత్ కిషన్ నాయక్, గుగులోత్ శ్రీనివాసరావు, పులిగండ్ల లక్ష్మీనారాయణ, బాదావత్ సామ్యా నాయక్, యాసా వెంకటరామారావు, మాళోత్ నాగేంద్రబాబు, బాబూలాల్ నాయక్, ఆదినారాయణ, సురేష్, రాజేష్, సోమ, తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వానికి పోరాడుదాం..



మాట్లాడుతున్న శారద

**ఇల్లెందు:** పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్న మహిళల సమాన హక్కుల కోసం పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు బయ్యా శారద, కౌన్సిలర్ రేళ్ల నాగలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందులో జరిగిన పీఓడబ్ల్యూ సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా పని చేస్తున్నారని తెలిపారు. అయితే వేతనాల్లో, హక్కుల్లో రిజర్వేషన్లలో మాత్రం సమానం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ కోసం పోరాడాల్సి ఉందన్నారు. మహిళలకు ఇంటికే పరిమితం చేసి వంటింటి కుందేళ్లుగా, పిల్లలు కనే యంత్రాలుగా మారుస్తున్నారని వాపోయారు. మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని, లైంగిక, భ్రూణ హత్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రక్షణ కోసం చట్టాలు ఉన్నా చట్టుబండలుగా మారినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాధమ్మ, నాగమణి, గీతా, భాగ్యలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అసమ్మతి నాయకుల సమావేశం

**జూలూరుపాడు:** జూలూరుపాడుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావు జామ తోటలో శుక్రవారం బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. మాట్లాడుతూ.. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డామని, రెండో సారి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు మమ్ములను పట్టించుకోలేదని వాపోయారు. బీఆర్ఎస్ నాయకులు రహస్యంగా సమావేశం కావడంతో జూలూరుపాడులో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్‌లో ఇప్పటికే మూడు వర్గాలుగా ఉండగా ఎమ్మెల్యే అనుచరులమని చెప్పుకుంటున్న మరో వర్గం సమావేశం కావడం చర్చకు కారణమయింది. సమావేశంలో యదళ్లపల్లి వీరభద్రం, నున్నా రంగారావు, చౌడం నరసింహారావు, మోదుగు రామకృష్ణ, దొండపాటి శ్రీనివాసరావు, రామిశెట్టి రాంబాబు ఉన్నారు.



## అటెన్షన్ ప్లీజ్

### పట్టు తప్పిందా.. ప్రాణాలు గోవిందా..

ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే వంతెన వద్ద జరుగుతున్న ఆర్వోబీ పనులు ప్రమాదకరంగా మారాయి. ఒకపక్క జేసీబీ సాయంతో ప్యానెళ్లు అమర్చుతుండగా.. మరోపక్క రహదారిపై ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్యానెళ్లు అమర్చే క్రమంలో ఒక్కోసారి పట్టు జారే ప్రమాదం ఉంది. అదే జరిగితే రోడ్డుపై ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కనీసం పనులు జరుగుతున్నట్లు సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం కొసమెరుపు. పనులు జరుగుతున్నాయని తెలిసేలా హెచ్చరికలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : శివగణేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 9440819020

## క్లుప్తంగా

### నేషనల్ జంబోరిలో 'నవభారత్' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

**పాల్వంచ:** ఇటీవల రాజస్థాన్ రాష్ట్రంలో జరిగిన 18వ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరిలో పాల్వంచ నవభారత్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 16 విద్యార్థులు తెలంగాణ తరఫున పాల్గొన్నారు. ఈసందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్, గ్లోబల్ విలేజ్, మార్చ్ ఫాస్ట్, స్టేట్ డే, రామాయణ ఘట్టాలు, నృత్య ప్రదర్శనల్లో మల్లికార్జున్, లఖిత, సహస్ర, లాస్య, సాత్విక్, భువన్ కార్తికేయ, సుమయ బంగారు పతకాలు సాధించారు. వీరిని శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వీ శ్రీనివాసరెడ్డి, విద్యా సమన్వయకర్త శ్రీదేవి, స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీలు లక్ష్మీరెడ్డి, బి.శ్రీనివాస్ అభినందించారు.

### డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** ఎంపీడీఓల నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ అనుదీప్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, టీఎంపీడీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.రామారావు, ప్రధాన కార్యదర్శి కె.వీరబాబు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు అప్పారావు, ఎంసీహెచ్ నాగేశ్వరరావు, వివిధ మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

**మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..**

**ఇల్లెందురూరల్:** మున్నూరుకాపు సంఘం ఇల్లెందు శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలండర్లను ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ శుక్రవారం ఆవిష్కరించారు. పట్టణంలోని ఐతా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో సంఘం క్యాలండర్లను పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్నూరు కాపు కులస్తులు తమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలండర్లను ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలం కేటాయింపుకు సహకరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు పింగళి నరేష్, ప్రధాన కార్యదర్శి ఆవుల శ్రీనివాస్, నేతలు ఆకుల చందర్, కొక్కు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వాల్ పోస్టర్లు..

**ఇల్లెందు:** సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 7వ మహాసభ ఈ నెల 29న కొత్తగూడెంలో జరుగుతుందని మహాసభను విజయవంతం చేయాలని ఎస్‌సీసీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం కోరారు. శుక్రవారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. కందగట్ల సురేందర్, వెంకన్న, తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, మల్లికార్జున్‌రావు, అంజయ్య, జటంగి వెంకన్న, వీరన్న, నర్సింహారావు, కిషన్ పాల్గొన్నారు.

### ఆర్థిక చేయూత

**ఇల్లెందురూరల్:** బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి వార్డు సభ్యుడు వల్లాల రంజిత్ బాసటగా నిలిచారు. ఇల్లు కూడా సరిగా లేని పరిస్థితిలో విద్యుత్ సౌకర్యం పొందేందుకు ఇబ్బంది పడుతున్న పార్వతి పాసి కుటుంబం పరిస్థితి తెలుసుకున్న బాలాజీనగర్ 11వ వార్డు సభ్యుడు వల్లాల రంజిత్ శుక్రవారం రూ.7వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో భూక్యా కోటేశ్వరరావు, ఉమర్, సాబ, దుర్గ, సంపత్, ప్రదీప్, శ్రీధర్, కృష్ణ, యాకూబ్, శ్రీకాంత్, పార్వతి పాల్గొన్నారు.

### పెండింగ్ వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న సుల్తానా

**ఇల్లెందురూరల్:** ట్రైబల్ వెల్ఫేర్ పీఎంహెచ్ హాస్టళ్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్ల 18 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏటీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరవధిక సమ్మెను శుక్రవారం కొనసాగించారు. సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి సుల్తానా మాట్లాడుతూ.. ఒక రంగ కార్మికులు సమ్మె చేస్తే మిగిలినవారు మద్దతు తెలిపి వారికి అండగా నిలవాలని కోరారు. డెయిలీవేజ్ వర్కర్ల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి పెండిగ్ వేతనాలు చెల్లించాలని లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈసం పద్మ, కుంజ జయ, సుజాత, అనిత, విజయ, భారతి, రమణమ్మ, దీప, సుధ, భద్రమ్మ, సుబ్రహ్మణ్యం, నబి తదితరులు పాల్గొన్నారు.